



లావేరు : పొలాల్లో ఉన్న మొక్కజొన్న

'వేపాడ'దే విజయం



- 8 రౌండ్లలోనూ టిడిపిదే ఆధిక్యం
- సిట్టింగ్ బిజెపి ఎమ్మెల్సీ మాధవ్ సహా 34 మందికి డిపాజిట్ల గల్లంతు
- పోస్టల్ బ్యాలెట్ సహా పోలైన ఓట్లు 2,13,035
- లెక్కించిన ఓట్లు 1,89,017
- అభ్యర్థి విజయానికి కావాల్సినవి 94,509
- టిడిపికి వచ్చినవి 82,977 ఓట్లు
- విజయానికి ఇంకా రావాల్సినవి 11,551
- ఎలిమినేషన్ ప్రక్రియను ప్రారంభించిన ఎన్నికల అధికారులు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

ఉత్తరాంధ్ర శాసన మండలి పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాన్ని తెలుగుదేశం పార్టీ దక్కించుకుంది. విజేతగా ఆ పార్టీ తరపున బరిలోకి దిగిన వేపాడ చిరంజీవిరావు నిలిచారు. ఈనెల 16న ఉదయం 8 గంటల నుంచి ఎడతెరిపి లేకుండా 17వ తేదీ రాత్రి వరకూ మండలి ఓట్ల లెక్కింపును సుమారు 500 మంది సిబ్బంది చేపట్టారు. తెలుగుదేశం అభ్యర్థి వేపాడ చిరంజీవిరావు, వైసిపి అభ్యర్థి సీతంరాజు సుధాకర్ మధ్యనే ప్రధాన పోటీ నెలకొంది. పోలైన ఓట్లలో టిడిపి అభ్యర్థి వేపాడ చిరంజీవిరావుకు 82,977, సీతంరాజు సుధాకర్‌కు 55,749 ఓట్లు వచ్చాయి. పిడిఎఫ్ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభ 35,148 ఓట్లతో మూడో స్థానంలో నిలిచారు. చిరంజీవిరావు విజయానికి ఇంకా 11,551 ఓట్లు అవసరం అధికారులు ఎలిమినేషన్ ప్రక్రియకు వెళ్లారు. 37 మంది అభ్యర్థుల్లో తక్కువ ఓట్లు వచ్చిన అభ్యర్థిని ఎలిమినేషన్ చేస్తూ అతనికి వచ్చిన ద్వితీయ ప్రాధాన్యతా ఓట్లను కలిపే దిశగా శుక్రవారం సాయంత్రం ఎన్నికల సిబ్బంది కసరత్తు ఆరంభించారు. అయితే ఓ న్యాయవాది వేసిన కేసు నేపథ్యంలో ఈ ఎమ్మెల్సీ ఎన్నిక ఫలితం తమకు లోబడి ఉండాలన్న హైకోర్టు తీర్పు నేపథ్యంలో విజేతను ఎన్నికల అధికారి ప్రకటిస్తారా? లేదా? అన్న దానిపై రకరకాల చర్చలు నడుస్తున్నాయి.

బిజెపికి డిపాజిట్ గల్లంతు

బిజెపి అభ్యర్థి పివిఎన్.మాధవ్‌కు 10,884 ఓట్లురాగా డిపాజిట్ గల్లంతైంది. 2017లో టిడిపి మద్దతుతో మాధవ్ బిజెపి తరపున ఉత్తరాంధ్ర పట్టభద్రుల శాసన మండలి ఎమ్మెల్సీగా గెలుపొందారు. అంతకు ముందు 2007, 2011 సంవత్సరాల్లో వరుసగా పిడిఎఫ్ అభ్యర్థి ఎంవిఎస్ శర్మ ఈ స్థానంలో గెలిచారు. 2023లో టిడిపి నేరుగా వేపాడ చిరంజీవిరావును బరిలోకి దించి ఆ సీటు దక్కించుకోవడం విశేషం.

గెలుపునకు కారణాలివే..

విశాఖలోని స్వర్ణభారతి ఇండోర్ స్టేడియంలో జరిగిన కౌంటింగ్ తొలి రౌండ్ నుంచీ టిడిపి అభ్యర్థే ఆధిక్యతను ప్రదర్శిస్తూ వచ్చారు. టిడిపికి జనసేనకు చెందిన పట్టభద్రులంతా ఈ ఎన్నికల్లో మద్దతుగా నిలిచి ఓట్లేశారు. అధికార పార్టీ వైసిపిపై ఉద్యోగ, ఉపాధ్యాయుల్లో వ్యతిరేకత కూడా టిడిపికి కలిసొచ్చింది. 20 ఏళ్లకు పైగా వేపాడ చిరంజీవిరావు ఆర్‌సి రెడ్డి కోచింగ్ సెంటర్, ఇతర కళాశాలల్లో ఎకానమీ లెక్చరర్‌గా కోచింగ్ ఇస్తూ పలువురు శిష్య బృందాన్ని తయారు చేసుకోవడంతో వారంతా ఈ ఎన్నికల్లో ఓటర్లను కలిసి ఆయన విజయానికి చేదోడుగా నిలిచారన్నది రూఢీ అవుతోంది.

వైసిపికి దెబ్బ

ఐదుగురు మంత్రులు, ఇద్దరు డిప్యూటీ సిఎంలు, ఆరుగురు ఎంపీలు, ఉత్తరాంధ్ర ఉమ్మడి జిల్లాలకు చెందిన ఎంఎల్‌ఎలు, ఇద్దరు ఎమ్మెల్సీలు, జిల్లాల సమన్వయ కమిటీల నేతలు కలిసినా కూడా వైసిపిని ఈ ఎన్నికల్లో గెలిపించుకోలేకపోయాయన్న విమర్శలను అధికార వైసిపి ఎదుర్కొంటోంది. పట్టభద్రుల ఎమ్మెల్సీ విషయంలో ఓట్లను సాధించడంలో పై చేయి సాధించలేకపోయారు. ఉపాధ్యాయులు, ఉద్యోగులు అధికార వైసిపికి దెబ్బ కొట్టారన్నది స్పష్టంగా తేలి పోయింది. ప్రభుత్వ వ్యతిరేక ఓటును అత్యధికంగా టిడిపి లాక్కోగలిగింది.

ఎన్నికల బరిలోకి ఆలస్యంగా ఎంట్రీ ఇచ్చిన చిరంజీవి.. ఓట్ల నమోదులో కూడా గణనీయ పాత్రమీ పోషించలేదు. అయినప్పటికీ ఎమ్మెల్సీ స్థానంలో విజేతగా నిలవడం చూస్తే వైసిపి వ్యతిరేకత పట్టభద్రుల్లో ఎంత ఉందో వెల్లడవుతోంది. అనూహ్యమైన రీతిలో తెలుగుదేశం పార్టీ బరిలోకి దిగి ఈ స్థానాన్ని కైవసం చేసుకోగలిగింది. గతంలో గాదు చిన్న కుమారి లక్ష్మిని ఎమ్మెల్సీ అభ్యర్థిగా టిడిపి అధినేత చంద్రబాబునాయుడు బరిలోకి దింపారు. ఆమెను మార్చాలని ఆయనపై టిడిపి శ్రేణులు ఒత్తిడి తేవడంతో చిరంజీవి రావును బరిలోకి దింపి వ్యూహాత్మకంగా వ్యవహరించి విజయం సాధించారు.

ప్రధాన అభ్యర్థులెవరేమన్నారంటే ?

తానే గెలవనున్నానన్న ధీమా తొలి నుంచీ ఉందని చిరంజీవిరావు తెలిపారు. ప్రభుత్వంపై వ్యతిరేకత తనను దెబ్బతీసిందంటూ వైసిపి అభ్యర్థి సీతంరాజు సుధాకర్ వెల్లడించారు.

ఓటర్లకు ధన్యవాదాలు : రమాప్రభ



మండలి ఎన్నికలలో తనకు ఓటు వేసిన వారందరికీ పిడిఎఫ్ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభ ఓ ప్రకటనలో ధన్యవాదాలు తెలిపారు. పట్టభద్రుల ఎన్నికలను సాధారణ ఎన్నికల్లా రాజకీయ పార్టీలు మార్చేసినా.. ఎలాంటి ప్రలోభాలకూ లోనవకుండా 35 వేల మందికి పైగా పట్టభద్రులు మొదటి ప్రాధాన్యత ఓటును తనకు వేశారన్నారు. నిస్వార్థంగా ప్రచారంలో పాల్గొని, అహర్నిశలూ కృషి చేసిన ప్రజా సంఘాల కార్యకర్తలకు, నాయకులకు, శ్రేయోభిలాషులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

అన్నదాతలకు వర్షం గుబులు

- పొలాల్లోనే ధాన్యం, మొక్కజొన్న
- పంటను కాపాడుకునేందుకు పాట్లు
- ప్రభుత్వం ధాన్యం కొనుగోలును నిలిపివేయడంతో ఇబ్బందులు



జి.సిగడాం : గడ్డితో కప్పి ఉంచిన ధాన్యం బస్తాలు

ప్రజాశక్తి - లావేరు, నౌపడ, ఆమదాలవలస, జి.సిగడాం

పశ్చిమ బెంగాల్ నుంచి ఒడిశా వరకు బంగాళాఖాతంలో ఏర్పడిన ద్రోణి ప్రభావంతో జిల్లాలో గురువారం రాత్రి వర్షాలు కురిశాయి. శుక్రవారం కూడా ఆకాశం మేఘావృతమై, అక్కడక్కడా చిరుజల్లులు కురవడంతో రైతుల్లో గుబులు మొదలైంది. అపరాల పంటల కారణంగా చాలా ప్రాంతాల్లో ఫిబ్రవరి నెలాఖరు, ఈనెలలో ధాన్యం నూర్పిళ్లు చేశారు. ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్లు నిలిపివేయడంతో ధాన్యం కొనేవారు లేక పొలాలు, కళ్లాల్లోనే ఉన్నాయి. ప్రభుత్వ నిర్ణయం ప్రస్తుతం అన్నదాతకు కష్టం తెచ్చిపెట్టింది. కోత కోసిన మొక్కజొన్న పంట కూడా పొలాలు, కళ్లాల్లో ఉండడంతో రైతులు టార్పాలిన్లు, ఫ్లెక్సీలు, కవర్లు కప్పి వర్షం నుంచి కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారు.

ధాన్యం కొనుగోలు లక్ష్యం పూర్తయిందని, పైనుంచి ఆదేశాలు వచ్చే వరకు ఏమీ చేయలేమని రైతుభరోసా కేంద్రాల్లో సిబ్బంది చెప్తుండడంతో అన్నదాతలు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. ఈ ఏడాది ఫిబ్రవరి 15వ తేదీతో కొనుగోలు ముగిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. నూర్పిళ్లు పూర్తి కాలేదని రైతులు, రైతు, ప్రజాసంఘాల ఆందోళన, ప్రజాప్రతినిధులు విన్నవించడంతో గత నెలాఖరు వరకు ప్రభుత్వం గడువు పెంచింది. వ్యవసాయశాఖ గణాంకాల ప్రకారం జిల్లాలో 8.01 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి కాగా, రైతుల నుంచి 4.85 లక్షల మెట్రిక్ టన్నులు సేకరించాలని లక్ష్యంగా నిర్దేశించారు. అధికారిక లెక్కల ప్రకారం జిల్లాలో ఇప్పటివరకు 1,32,281 నుంది రైతుల నుంచి 4.93 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశారు. ఇంకా 62,044 మంది రైతుల వద్ద 1.45 లక్షల టన్నుల ధాన్యం అమ్మకానికి ఉన్నట్లు ప్రభుత్వానికి నివేదికలు పంపించారు. ఇందులో పోలాకి మండలంలో అత్యధికంగా సుమారు 14వేల మెట్రిక్ టన్నుల నిల్వలు ఉన్నాయని వ్యవసాయశాఖ నివేదికలో పేర్కొంది. నరసన్నపేట, గార, కొత్తూరు మండలాల్లోనూ అధిక మొత్తంలో నిల్వలు ఉన్నాయి. ఖరీఫ్ వరి కోతల సమయంలోనే జిల్లాలో మినుము, పెసర పంటలు వేస్తుంటారు. దీంతో వరిని వెంటనే నూర్చకుండా పొలాల్లోనే కుప్పలుగా ఉంచారు. అపరాలు పూర్తి కావడంతో ధాన్యం నూర్పులు గత నెలాఖరు, ఈ నెలలో చేశారు. ఈలోగానే ప్రభుత్వం ధాన్యం కొనుగోలు ప్రక్రియను ముగించడంతో ఆలస్యంగా నూర్చిన ధాన్యం నిల్వలన్నీ రైతుల వద్దే ఉండిపోయాయి. మిగిలి ఉన్న ధాన్యం కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు. పొలాల్లో, కళ్లాల్లో ఉన్న ధాన్యం నిల్వలు వర్షాల కారణంగా తడిచి మొలకలు ఎత్తితే ఆరుగాలం శ్రమించి, పెట్టిన పెట్టుబడులు నీటపాలవుతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.

మొక్కజొన్న రైతుల ఆందోళన

రబీలో ఎచ్చెర్ల నియోజకవర్గంలోని లావేరు మండలంలో 7,125 ఎకరాలు, జి.సిగడాంలో 6,250, రణస్థలంలో 8,750 ఎచ్చెర్లలో 3,125 ఎకరాలు మొత్తం 25,250 ఎకరాల్లో రైతులు మొక్కజొన్న సాగు చేశారు. ఈ సీజన్‌లో ఎకరాకు 35 నుంచి 40 క్వింటాలు దిగుబడి వస్తుందని ఆశిస్తున్న సమయంలో వర్షాలతో కలవరపాటుకు గురయ్యారు. గురువారం సాయంత్రం నుంచి మేఘావృతం కావడంతో కోత కోసి పొలాల్లో, కళ్లాల్లో, రహదారులపై ఉన్న పంటను టార్పాలిన్లు కప్పి ఉంచారు. భారీ వర్షాలు కురిస్తే మొక్కజొన్న తడిచిపోతుందని ఆందోళన చెందుతున్నారు.

కరిగిపోనున్న ఉప్పు రైతుల కష్టం

సంతబొమ్మాళి మండలం నౌపడ పరిసర ప్రాంతాల్లో ఈ ఏడాది సుమారు వెయ్యి ఎకరాల్లో ఉప్పును సాగు చేస్తున్నారు. ప్రధానంగా డిసెంబరు నుంచి జులై వరకు ఈ పంటను పండిస్తారు. ఎండ తీవ్రతతో పండించే పంట కావడంతో ఎండలపై ఆధారపడుతుంటారు. అకాల వర్షాలతో రైతుల కష్టమంతా కరిగిపోతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉయ్యాలపేట, నౌపడ, సీతానగరం, మర్రిపాడు, శలగపేట గ్రామాల్లో రెండు రోజుల కిందట ఉప్పు తీసి గల్లీల్లో ఎక్కడికక్కడ ఉప్పు కుప్పలుగా వేశారు. ఇవి బస్తాలకు ఎత్తి అమ్ముకునేందుకు సిద్ధమవుతున్న తరుణంలో వర్షాలు ఉప్పు రైతులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయి.



నౌపడ : రైతులు వేసిన ఉప్పు కుప్పలు

సాహిత్యంలో మహిళల ముద్ర

తెలుగు అకాడమీ చైర్‌పర్సన్ లక్ష్మీపార్వతి

ప్రజాశక్తి - టెక్కలి

సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాహిత్య రంగాల్లో మహిళలు మరింత ఎదగాల్సిన అవసరం ఉందని తెలుగు అకాడమీ చైర్‌పర్సన్ నందమూరి లక్ష్మీపార్వతి అన్నారు. 'సాహిత్యంలో మహిళలు' అనే అంశంపై స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో శుక్రవారం నిర్వహించిన జాతీయ సదస్సులో ఆమె ప్రసంగించారు. సాహిత్యంలో మహిళలు తమదైన ముద్ర వేశారని చెప్పారు. సమాజంలోని అనేక సామాజిక రుగ్మతలపై పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. మహిళా సంక్షేమం కోసం ప్రభుత్వాలు అనేక పథకాలు ప్రవేశపెడుతున్నాయని తెలిపారు. చట్టాలను అవగాహన చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. మహిళలు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. విద్యార్థుల్లో సామాజిక స్పృహ ఉండాలన్నారు.

సబ్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ చదువు పరిధులను దాటి ముందుకెళ్తే భవిష్యత్ ఏమిటన్న ఆలోచన ప్రతి ఒక్కరికీ రావాలన్నారు. చదువు అందించే విజ్ఞానం పది మందికి ఉపయోగపడాలన్నారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ నిమ్మ వెంకటరావు మాట్లాడుతూ విద్య ద్వారా నేర్చుకుంటున్న అంశాలపై అవగాహన పెంచుకుని తమ జీవితానికి అన్వయించుకోవాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ తెంబూరు గోవిందమ్మ అధ్యక్షతన నిర్వహించిన సదస్సులో సిహెచ్.తులసి, డేవిడ్ కుమార్, శోభారాణి, సీతారాం, జయభారతి, కళాశాల అధ్యాపకులు బి.సతీష్‌కుమార్, లీలాపద్మజ, ఝూన్సీరాణి, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న లక్ష్మీపార్వతి



అనసూయ సందడి

ప్రజాశక్తి - పలాస

సినీ నటి, యాంకర్ అనసూయ భరద్వాజ్ కాశీబుగ్గలో శుక్రవారం సందడి చేశారు. కాశీబుగ్గలో లక్కీ షాపింగ్ మాల్‌ను రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి అప్పలరాజు సతీమణి శ్రీదేవి, మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు, మాజీ ఎంపీ కణితి విశ్వనాథంతో కలిసి ప్రారంభించారు. అనసూయ జ్యోతి ప్రజ్వలన చేశారు. ఆమెను చూసేందుకు పలాస-కాశీబుగ్గ జంట పట్టణాలతో పాటు సమీప ప్రాంతాల్లోని యువత ఎగబడ్డారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పలాస రావడం ఇదే తొలిసారి అని, ఈ ప్రాంతం తనకు ఎంతో నచ్చిందన్నారు. మంచి అవకాశాలు వస్తే సినిమాల్లో మరిన్ని మంచి పాత్రలు పోషిస్తానన్నారు. సినిమాల కారణంగా సమయం లేకపోవడంతోనే యాంకరింగ్‌కు దూరం కావాల్సి వచ్చిందని తెలిపారు. అవకాశం, సమయం వచ్చినప్పుడు మళ్లీ టివిలో యాంకర్‌గా కనిపిస్తానన్నారు. లక్కీ షాపింగ్‌మాల్‌లో అందరికీ అందుబాటులో ఉండే వస్త్రాలు లభిస్తాయని చెప్పారు. కార్యక్రమంలో లక్కీ షాపింగ్‌మాల్ యాజమాన్య ప్రతినిధులు శ్రీనివాస్, రత్తయ్య స్వామి తదితరులు పాల్గొన్నారు.

వారంలో పునరావాస పరిహారం

జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్

ప్రజాశక్తి - నౌపడ

భావనపాడు పోర్టు నేపథ్యంలో మూలపేట, విష్ణుచక్రం గ్రామాల పునరావాసానికి నౌపడలో భూములు ఇచ్చిన రైతులకు వారం రోజుల్లో నష్ట పరిహారం అందజేయనున్నట్లు జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ తెలిపారు. సంతబొమ్మాళి మండలంలోని నౌపడ, యామలపేట, పోతునాయుడు పేటలో జిరాయతీ భూములను శుక్రవారం పరిశీలించారు. నౌపడలో పోర్టు పునరావాస కాలనీ ఏర్పాటుకు 55 ఎకరాలు అవసరం కాగా, ఇప్పటికి 32 ఎకరాలను సేకరించామని చెప్పారు. పోర్టుకు రోడ్ల ఏర్పాటుకు అక్కడి రైతులు సమ్మతి తెలిపారని రెవెన్యూ సిబ్బంది జెసి దృష్టికి తీసుకొచ్చారు. యామలపేట, పోతునాయుడుపేట రైల్వే లైన్ భూములతో పాటు హద్దులను పరిశీలించారు. ఆయన వెంట టెక్కలి సబ్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి, రెవెన్యూ అధికారులు ఉన్నారు.



నౌపడలో భూములను పరిశీలిస్తున్న జెసి నవీన్

ఉద్దానం తాగునీటి పనులు వేగవంతం

కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ ఆదేశం

ప్రజాశక్తి - హిరమండలం

ఉద్దానం తాగునీటి పథకం పనులు వేగవంతం కావాలని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ అధికారులను ఆదేశించారు. వంశధార రిజర్వాయర్‌లో చేపడుతున్న ఉద్దానానికి తాగునీరు ఇచ్చే రక్షిత మంచినీటి పథకం పనులను శుక్రవారం పరిశీలించారు. వంశధార రిజర్వాయర్‌లో నీటిని తోడేందుకు పంపు, ఫిల్టరేషన్ ఇతర పనులను పరిశీలించి, రిజర్వాయర్‌లో ఎంత శాతం నీరు ఉంటే తాగునీరు అందించగలమని అధికారులను అడిగి తెలుసుకున్నారు. నీటిని విడుదల చేసే కార్యక్రమాన్ని పండగలా చేయాలని కలెక్టర్ సూచించారు. పాతపట్నం మండలంలో పైపులైన్ ఏర్పాటుకు పలు ఇబ్బందులు ఉన్నాయని ఆర్‌డబ్ల్యుఎస్ డిఇ ఆశాలత కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. మందస మండలం హైవే వద్ద కూడా సమస్య ఉందని వీటిని పరిష్కరించాలని కోరారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ టెక్కలి సబ్ కలెక్టర్‌కు సమస్యల పరిష్కార బాధ్యతలు అప్పగిస్తామన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఉండవని, సహకరించాలని కోరారు. పనులు వేగవంతం చేసి ఈ వేసవికే తాగునీరు ఇచ్చేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వంశధార రిజర్వాయర్ పనులను మరింత వేగవంతం చేయాలన్నారు. ఎత్తిపోతల పథకం పనుల పురోగతి వివరాలను వంశధార ఇఇ ఎం.వి రమణమూర్తిని అడిగి తెలుసుకున్నారు. ఎత్తిపోతల పథకం పూర్తయితే జిల్లా రైతులకు రెండు పంటలకు నీరు అందించవచ్చని చెప్పారు. పది రోజులుగా కుడి కాలువ ద్వారా నీరు ఇవ్వడం లేదని, దీనివల్ల పంటలు ఎండిపోతున్నాయని సరుబుజ్జిలి మండలానికి చెందిన పలువురు రైతులు కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. వంశధార రిజర్వాయరులో నీరు తక్కువగా ఉండడం వల్ల రెండు పంటలకు నీరు అందించలేకపోతున్నామని, దీన్ని రైతులు అర్థం చేసుకోవాలన్నారు. మరో వారం రోజులు నీరు విడుదల చేయడానికి చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ ప్రసాద్, డిఇ మధుసూదన్, వంశధార డిఇ సురేష్, తహశీల్దార్ బి.మురళీమోహనరావు, పలువురు అధికారులు పాల్గొన్నారు.



పరిశీలిస్తున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

రచ్చకెక్కొద్దు... కలసి పనిచేద్దాం

- వచ్చే ఎన్నికల్లో టిడిపి గెలుపే లక్ష్యం
- స్పష్టం చేసిన 'గుండ' దంపతులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

చంద్రబాబు నాయుడును ముఖ్యమంత్రి చేయాలన్న సంకల్పంతో తాము ఏ త్యాగానికైనా సిద్ధమని మాజీ మంత్రి గుండ అప్పలసూర్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి స్పష్టం చేశారు. రచ్చకెక్కకుండా వచ్చే ఎన్నికల్లో పార్టీ ఎవరిని అభ్యర్థిగా నిర్ణయిస్తే వారి విజయానికి అందరం కలసికట్టుగా పనిచేద్దామన్నారు. అరసవల్లిలోని వారి నివాసంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీగా వేపాడ చిరంజీరావు గెలుపును ముందే ఊహించామన్నారు. వేపాడకు మద్దతుగా టిడిపి శ్రేణులు విస్తృతంగా ప్రచారం చేశాయని చెప్పారు. వైసిపి ప్రభుత్వ మోసపూరిత పాలనను అర్థం చేసుకున్న పట్టభద్రులు ఓటు ద్వారా తమ సత్తా చూపించారని చెప్పారు.

2024లో టిడిపి విజయానికి ఈ గెలుపు నాంది అని అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల జిల్లా పర్యవేక్షణ బాధ్యతలు మాజీ మంత్రి జవహర్‌కు, శ్రీకాకుళం నియోజకవర్గ బాధ్యతలు మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవికి చంద్రబాబు నాయుడు అప్పగించారని గుర్తు చేశారు. లక్ష్మీదేవి నియోజకవర్గం మొత్తం విస్తృత ప్రచారం చేసి బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించారని చెప్పారు. పార్టీలో విభేదాలు సృష్టిస్తూ రచ్చకెక్కించే కార్యక్రమాలకు పాల్పడవద్దన్నారు. టిడిపి శ్రేణులు సైనికుల్లా పనిచేసి పూర్వవైభవం తేవడానికి సిద్ధంగా ఉన్నాయన్నారు. ఇటువంటి సమయంలో విభేదాలు వీడి సార్వత్రిక ఎన్నికల్లో అధిష్టానం నిర్ణయించిన అభ్యర్థి విజయానికి శక్తి వంచన లేకుండా కలిసి పనిచేద్దామని పిలుపునిచ్చారు.

సామాన్యుల సంక్షేమ బడ్జెట్

వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్

ప్రజాశక్తి - నరసన్నపేట

సామాన్యుల జీవితాల్లో ప్రగతి కాంతులు నింపే సంక్షేమ బడ్జెట్‌ను రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిందని ఎమ్మెల్యే, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని ప్రధానమైన సాగునీటి ప్రాజెక్టులకు ఈ బడ్జెట్ లో నిధులు కేటాయించారని తెలిపారు. వంశధార ప్రాజెక్టు పనులకు రూ.180.73 కోట్లు, మహేంద్రతనయపై ఆఫ్‌షోర్ ప్రాజెక్టుకు రూ 60.12 కోట్లు, ట్రిపుల్ ఐటికి రూ.130 కోట్లు, అంబేద్కర్ యూనివర్సిటీ అభివృద్ధికి రూ.7.5 కోట్లు కేటాయించడం ద్వారా జిల్లాకు ప్రాధాన్యత ఇచ్చారని పేర్కొన్నారు. ఎప్పట్లాగే ప్రభుత్వ అత్యంత ప్రాధాన్యత అంశాలైన విద్య, వైద్యం, వ్యవసాయం కోసం బడ్జెట్‌లో ప్రత్యేకంగా నిధులు కేటాయించిందని తెలిపారు. ఎక్కడ విద్యాధికులు ఉంటారో ఆ రాష్ట్రం అన్ని రంగాల్లో ముందుంటుందని విద్యా రంగానికి రూ.32 వేల కోట్లను ఈ బడ్జెట్‌లో కేటాయించారని పేర్కొన్నారు.

ఆరోగ్యవంతమైన సమాజమే లక్ష్యం

శ్రీకాకుళం : ఆరోగ్యవంతమైన సమాజం అందరి లక్ష్యం కావాలని, ఆ దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని శ్రీకాకుళం నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ మాసోత్సవాల్లో భాగంగా నగరంలోని సూర్యమహల్ కూడలి వద్ద ఆయుష్ విభాగం ఆధ్వర్యాన శుక్రవారం నిర్వహించిన మెగా వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. రెడ్‌క్రాస్ ఏర్పాటు చేసిన సిపిఆర్ డెమో ప్రయోజనాలను కె.సత్యనారాయణ వివరించారు. వైద్య శిబిరంలో దీర్ఘకాలిక వ్యాధులు, శ్వాసకోశ సంబంధిత ఇబ్బందులు, చర్మ వ్యాధులు, కీళ్లనొప్పులు తదితర వాటికి సంబంధించి వైద్య సేవలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు, హనుమంతు కృష్ణారావు, ఆయుష్ రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ వై.శేఖర్, సీనియర్ మెడికల్ ఆఫీసర్ పి.జగదీష్, వి.సీతామహాలక్ష్మి, పి.పద్మజ తదితరులు పాల్గొన్నారు.



వైద్య శిబిరంలో కమిషనర్ ఓబులేసు

1434 మంది గైర్హాజరు

శ్రీకాకుళం : ఇంటర్ ప్రథమ సంవత్సర రెండో రోజు ఇంగ్లీష్ పరీక్షకు 1434 మంది విద్యార్థులు శుక్రవారం గైర్హాజరయ్యారు. వీరిలో సాధారణ కోర్సులకు 1264 మంది, వృత్తి విద్యా కోర్సులకు 170 మంది హాజరు కాలేదు. 28,973 మంది హాజరు కావాల్సి ఉండగా 27,539 మంది రాసినట్లు ఆర్ఐఓ ఎస్ తవిటినాయుడు తెలిపారు. సాధారణ కోర్సులకు 26,407 మందికి గానూ 25,143 మంది, వృత్తి విద్యా కోర్సులకు 2,566 మందికి గానూ 2,396 మంది పరీక్ష రాశారు.

సవరణ

తేది:12-03-2023 ఆదివారం ప్రజాశక్తి దినపత్రిక 5వ పేజీలో ప్రచురితమైన పబ్లిక్ నోటిఫికేషన్లో **I.P.No.5/2022** కు బదులుగా **I.O.No.5/2022** గా ప్రచురితమైనది. కావున రెస్పాండెంట్స్ ఈ సవరణను గమనించగలరని తెలియపర్చుచున్నాం.


మార్కులు తక్కువ వచ్చాయని విద్యార్థిని చితకబాదిన టీచర్


తట్లు తేలిన విద్యార్థిని వీపు

ప్రజాశక్తి - ఇచ్ఛాపురం

మార్కులు తక్కువ వచ్చాయని విద్యార్థినిని ఓ టీచర్ కొట్టిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. పూర్తి వివరాలిలా ఉన్నాయి. బొడ్డకల్లి గ్రామానికి చెందిన బాలిక గ్రామ పాఠశాలలో 4వ తరగతి చదువుతోంది. ఇటీవల జరిగిన పరీక్షల్లో విద్యార్థినికి తక్కువ మార్కులు రావడంతో ఉపాధ్యాయుడు విద్యార్థిని తట్లు తేరేలా కొట్టాడు. దీంతో విద్యార్థిని ఏడ్చుకొని ఇంటికి వె ళ్లడంతో తల్లిదండ్రులు ఏమైందని ప్రశ్నించగా జరిగిన విషయం చెప్పింది. విద్యార్థిని తల్లిదండ్రులు ఈ విషయాన్ని సర్పంచ్ దృష్టికి తీసుకెళ్లారు. మార్కులు తక్కువ వస్తే భయం చెప్పడం తప్పు లేదని, మరీ ఇంత దారుణంగా కొట్టడం ఏమిటని ప్రశ్నించారు. తక్షణమే విద్యాశాఖ అధికారులు ఉపాధ్యాయునిపై చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు డిమాండ్ చేశారు.

ప్రమాదాలు తగ్గుముఖం


మాట్లాడుతున్న సిఐ వినోద్‌బాబు

ప్రజాశక్తి - మెళియాపుట్టి

అవసరమైన చోట స్పీడ్ బ్రేకర్లు వేయడం ద్వారా ప్రమాదాలు తగ్గుముఖం పట్టాయని పాతపట్నం సిఐ వినోద్‌బాబు అన్నారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. పేకాట ఆడటం తగ్గుముఖం పట్టిందని చెప్పారు. ఆంధ్రా, ఒడిశా సరిహద్దులో అక్రమ రవాణాలపై మరింత నిఘా ఉంచినట్లు తెలిపారు. ఆయనతో పాటు స్థానిక ఎస్ఐ టి.రాజేష్, ఎఎస్ఐలు నర్సింగరావు, అప్పన్న పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

'గేట్'లో మెరిసిన వంశీకృష్ణ

ప్రజాశక్తి - ఆమదాలవలస

గేట్‌లో మున్సిపాలిటీకి చెందిన బసవ వంశీకృష్ణ మెరిశాడు. గురువారం విడుదలైన ఫలితాల్లో ఆల్ ఇండియాలో 64వ ర్యాంకు సాధించాడు. తల్లిదండ్రులు బసవ వెంకట శ్యామసుందరరావు బస్సు ఓనర్ కాగా, తల్లి లలిత గృహిణి. వంశీకృష్ణ ఒకటో తరగతి నుండి ఏడో తరగతి వరకు పట్టణంలోని అశోక పబ్లిక్ స్కూల్లో, ఎనిమిదో తరగతి నుండి పదో తరగతి వరకు శ్రీకాకుళంలోని భాష్యం స్కూల్‌లో, ఇంటర్ శ్రీ చైతన్యలో, విశాఖలో బిటెక్, నిట్ గోవాలో చదివి, గోల్డ్ మెడల్ సాధించాడు. ఈ సందర్భంగా వంశీకృష్ణ డిసిసి జిల్లా అధ్యక్షురాలు బొడ్డేపల్లి సత్యవతి ఆశీస్సులు తీసుకున్నారు. ఆమె స్వీట్‌ను తినిపించి ఉన్నత విద్యను అభ్యసించి తల్లిదండ్రులకు, గురువులకు మంచి పేరును తీసుకురావాలని అభినందించారు.


వంశీకృష్ణకు స్వీట్ తినిపిస్తున్న సత్యవతి


రోడ్డుపై ఉన్న గోతులు


క్రషర్ బుగ్గి వేసి వదిలేసిన రోడ్డు

తారు రోడ్డు పనులెప్పుడు?

ప్రజాశక్తి - పలాస

- శంకుస్థాపన చేసి మూడేళ్లు
- రోడ్డు లేక గిరిజనుల ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు

ఆ గిరిజన గ్రామాలకు తారు రోడ్డు మంజూరైందని ఆనందపడ్డారు. తారు రోడ్డుపై రాకపోకలు చేస్తామని కళలు కన్నారు. స్వతంత్రం వచ్చి నేటికీ 76ఏళ్లు కావస్తున్న సమయంలో తారు రోడ్డు నిర్మాణానికి నోచుకుంటుందన్న వార్త వారిలో ఊపిరి పోసింది. కానీ ఆ గిరిజన ప్రాంత ప్రజలకు నిరాశే మిగిలింది. ఎక్కడ వేసిన గొంగళి అక్కడే చందంగా రోడ్డు తయారైంది. శంకుస్థాపన చేసి సుమారు మూడేళ్లు కావస్తున్న నిర్మాణానికి నోచుకోలేని పరిస్థితి.

పలాస మండలం సవర గోవిందపురం జంక్షన్ నుంచి కొటారింగ్ తాళ్లభద్ర వరకు సుమారు ఏడు కిలోమీటర్లు వరకు తారు రోడ్డు నిర్మాణానికి రూ.2.12 కోట్లు మంజూరు చేశారు. అందుకు 2020 జులైలో రోడ్డు నిర్మాణానికి రాష్ట్ర పశుసంవర్ధకశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు శంకుస్థాపన చేశారు.

అప్పటి నుంచి ఇప్పటివరకు రోడ్డు పనులు జరగలేదు. కేవలం రోడ్డుపై క్రషర్ బుగ్గి వేసి కాంట్రాక్టర్ చేతులు దులుపుకున్నారు. రోడ్డు పనులు పూర్తి చేయాలని అధికారులను పదేపదే విన్నవించినా ఫలితం లేకపోయిందని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఉన్న రోడ్డుపై కష్టమైనా ప్రయాణం చేసేవాళ్లమని, ప్రస్తుతం మరింత దారుణంగా ఉందని గిరిజనులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చొరవ చూపి రోడ్డు పనులు పూర్తి చేసి రాకపోకలకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని గిరిజనులు కోరుతున్నారు.


శంకుస్థాపన చేసిన శిలాఫలకం


పలాస : బాణసంచా కాలుస్తున్న టిడిపి నాయకులు


కోటబొమ్మాళి : కేకును కోస్తున్న టిడిపి నాయకులు


మెళియాపుట్టి : కేకును కట్ చేస్తున్న టిడిపి నాయకులు

టిడిపి శ్రేణుల సంబరాలు

ప్రజాశక్తి - కోటబొమ్మాళి

ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీగా టిడిపి అభ్యర్థి వేపాడ చిరంజీవి అత్యధిక మెజార్టీతో గెలుపొందడంపై టిడిపి నాయకులు సంబరాలు చేసుకున్నారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శి బోయిన గోవిందరాజులు, మెండ దాసునాయుడు, బోయిన రమేష్ శుక్రవారం ఎర్రన్నాయుడు పార్కు వద్ద ఎన్‌టిఆర్, ఎర్రన్నాయుడు విగ్రహాలకు పూలమాలేసి, నివాళులర్పించారు. కేకును కట్ చేసి అభిమానులకు పంచిపెట్టారు. అనంతరం బాణ సంచా కాల్చారు. వారు మాట్లాడుతూ వేపాడ చిరంజీవిని గెలిపించిన ఉపాధ్యాయ, ఉద్యోగులను, పట్టభద్రులకు, ముఖ్యంగా పార్టీ కార్యకర్తలకు హృదయ పూర్వక ధన్యవాధాలు తెలియపారు. కార్యక్రమంలో ఎంపిటిసి పి.సింహాచలం, వెలమల కామేశ్వరరావు, ఎంపిపి టి.రామకృష్ణ, కర్రి అప్పారావు, కోరాడ గోవిందరావు, బి.శ్రీనివాస్, కోట సంతోష్‌కుమార్, డి.సింహాద్రమ్మ, అప్పారావు, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

మెళియాపుట్టి: ఎమ్మెల్సీగా వేపాడ చిరంజీవి గెలుపొందడంతో మండల కేంద్రంలో టిడిపి నాయకులు విజయోత్సవ వేడుకలు జరుపుకున్నారు. బాణ సంచా కాల్చి కేకును కట్ చేసి, మిఠాయిలు అందరికీ పంచిపెట్టారు. ఈయన గెలుపుపై టిడిపి వర్గీయుల్లో ఆనందోత్సవం నెలకొంది. కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు భాస్కర్ గౌడ్ ప్రధాన కార్యదర్శి ఉల్లాన వసంత్ జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు బూర్ల లలిత కుమారి, పైడి రాజు, గణపతి పరమేశ్‌రెడ్డి, పడాల శ్రీను, సయ్యద్ సిలార్, పలువురు టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పలాస: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీగా వేపాడ చిరంజీవిరావు గెలుపొందడంతో టిడిపి నాయకులు సంబరాలు చేసుకున్నారు. కాశీబుగ్గ ఎన్‌టిఆర్ విగ్రహం వద్ద, పలాసలో టిడిపి నాయకులు బాణ సంచా కాల్చారు. స్వీట్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో నాయకులు విఠల్‌రావు, లొడగల కామేష్, బడ్డ నాగరాజు, గాలి కృష్ణ, మల్లా శ్రీనివాస్, కనితి సురేష్, మల్లి, డొక్కరి శంకర్, రవిశంకర్ గుప్తా, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

రేషన్ ఇప్పించాలని ధర్నా


సబ్ కలెక్టరేట్ ముందు ధర్నా చేస్తున్న లబ్ధిదారులు

ప్రజాశక్తి - టెక్కలి

టెక్కలి మేజర్ పంచాయతీ శ్రీనివాసనగర్‌కు ఇవ్వాల్సిన రేషన్ బియ్యం పంపిణీలో ఆవకతవకలు చోటు చేసుకుంటున్నాయని, దీంతో తమకు బియ్యం అందడం లేదని లబ్ధిదారులకు శుక్రవారం సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీనివాసనగర్‌లోని 5వ లైనులో నివశిస్తున్న లబ్ధిదారులు ఎవరికీ బియ్యం అందడం లేదన్నారు. డీలరు అధికార పార్టీకి చెందిన వ్యక్తి కావడం వల్ల సరుకుల పంపిణీలో చేతివాటం ప్రదర్శిస్తున్నారని చెప్పారు.సబ్ కలెక్టర్ అందుబాటులో లేకపోవడంతో బాధితులు అసహనం చెందారు. విషయం తెలుసుకున్న వాలంటీరు వచ్చి లబ్ధిదారులను ఇళ్లకు తీసుకెళ్లిపోవడం గమనార్హం.

బీజామృతంతో విత్తనాలకు రక్షణ


చెరుకు కణుపులను సిద్ధం చేస్తున్న రైతులు

ప్రజాశక్తి - ఆమదాలవలస

మండలంలోని నిమ్మతొర్లాడ గ్రామంలో ప్రకతి వ్యవసాయ మండల యాంకర్ నక్క చిరంజీవిరావు ఆధ్వర్యంలో రైతులు చెరకు కణుపులను బీజామృతంతో విత్తన శుద్ధి చేసి పొలంలో నాటుకునేందుకు సిద్ధం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ విత్తనాలనైనా సరే బీజామృతంలో విత్తన శుద్ధి చేసి నాటుకోవడం వల్ల విత్తనాలకు తెగుళ్ల నుండి రక్షణ ఉంటుందని తెలిపారు. విత్తనాలు మొలక శాతం కూడా విత్తన శుద్ధి చేసుకోవడం వల్ల బాగా వస్తాయని, ప్రకృతి సేద్యంలో ఏ విధమైన ఖర్చు లేకుండా పూర్తిగా సహసిద్ధంగా పంటలను పండించవచ్చని తెలిపారు. నేలకు ఎటువంటి హాని చేయకుండా మంచి దిగుబడులు సాధించవచ్చని రైతులకు వివరించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది కృష్ణవేణి, రైతులు పాల్గొన్నారు.

బిసి సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రాజశేఖర్


నియామక పత్రం అందుకుంటున్న రాజశేఖర్

ప్రజాశక్తి - రణస్థలం రూరల్

జాతీయ బిసి సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ముద్దాడ రాజశేఖర్ యాదవ్ నియమితులయ్యారు. విశాఖలోని ప్రెస్‌క్లబ్‌లో జాతీయ బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు లాక వెంగళరావు యాదవ్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ముద్దాడను ప్రకటించారు. బిసిలకు చేస్తున్న సేవలను గుర్తించి ఈ పదవిని తనకు ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఈ పదవి రావడంతో మరింత బాధ్యత పెరిగిందన్నారు. బిసిల హక్కులు కోసం పోరాడుతానని, వారి అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని అన్నారు. ఈ సందర్భంగా వెంగళరావు, వెలగల నూకానమ్మ, నాగేశ్వరరావు, కె.వెంకటరమణ, పి.చంద్రవతికి ధన్యవాదాలు తెలిపారు.

'ఉపాధి' పనుల పరిశీలన


మాట్లాడుతున్న ఎంపిడిఒ చంద్రకుమారి

ప్రజాశక్తి - మెళియాపుట్టి

మండలంలోని పెద్ద పద్మాపురం, పడ్డ పంచాయతీల్లో చేపడుతున్న ఉపాధి హామీ పనులను ఎంపిడిఒ పి.చంద్రకుమారి శుక్రవారం పరిశీలించారు. కొలతల ప్రకారం పనిచేస్తే రూ.250 కూలి వస్తుందన్నారు. అనంతరం మస్టర్‌లను తనిఖీ చేశారు. పని ప్రదేశంలో కనీస వసతులు కల్పించాలన్నారు. ఆమెతో పాటు ఈసి ఆదినారాయణ, ఫీల్డ్ అసిస్టెంట్ రాజు, తదితరులు పాల్గొన్నారు.

ఉద్దానం పంటకు అంతర్రాష్ట్ర ఖ్యాతి

ప్రజాశక్తి - వజ్రపుకొత్తూరు

ఉద్దాన ప్రాంతంలో జీడి మామిడి తర్వాత ప్రముఖంగా పండే పనసకు అంతర రాష్ట్ర ఖ్యాతి లభించింది. ఉద్దానం ప్రజలకు జీవనాధారమైన ముఖ్యమైన పంటల్లో పనస ప్రముఖ పాత్ర పోషిస్తుంది. ఉద్దానం సముద్ర తీర ప్రాంతంలోని ఇసుక నేలలు పనసపొంటకు అనుకూలమైనవి. జిల్లాలో తీర ప్రాంత మండలాలైన వజ్రపుకొత్తూరు, పలాస, మందస, సోంపేట, కవిటి, ఇచ్ఛాపురం మండలాల్లోని ఉద్దనం ప్రాంత రైతులు పనస పంటను సాగు చేస్తున్నారు. వేలాది ఎకరాల్లో ఈ పంట సాగు చేస్తున్నారు. పనస పంట ఏటా నవంబర్ నుంచి ఏప్రిల్ వరకు అందుబాటులో ఉంటుంది. ఒడిశాలోని బరంపురం అంబో మార్కెట్‌కు రవాణా చేస్తుంటారు. స్థానికంగా పలాస, హరిపురం, కంచిలి మార్కెట్‌కు పనస కాయలను తరలిస్తారు. దీపావళి ప్రారంభానికి ముందు నుంచి ఉద్దానం పనసకు మంచి గిరాకీ ఏర్పడుతుంది. ముఖ్యంగా ఒడిశా, వెస్ట్ బెంగాల్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలకు ఎక్కువ మొత్తంలో పనస ఎగుమతి జరుగుతుందని స్థానిక వ్యాపారులు చెబుతున్నారు. పనసలో పోషక విలువలు అధికంగా ఉండటం వల్ల ప్రజలు ఆహారంగా ఉపయోగిస్తున్నారు. వివాహాలు, ఇతర శుభ కార్యాల్లో పనసకాయ పకోడీ, పనసకాయ కూర, పనసకాయ పులుసు చాలా ప్రాముఖ్యతను సంతరించుకున్నాయి. దీంతో రైతులు స్థానిక వర్తకులు, దళారీలతో ముందస్తు ఒప్పందం ప్రకారం కాయలను బరంపురం రవాణా చేస్తున్నారు. ఉద్దానంలో పండే కొబ్బరి, మామిడి, పనస వంటి ఉద్యాన పంటలకు ప్రధాన మార్కెట్ ఒడిశా. కొన్ని దశాబ్దాలుగా ఇదే రీతిలో వ్యాపారాలు సాగుతున్నాయి. ఒడిశాలో పండగకు పనస, మామిడి పళ్లను ఒడిశావాసులు ఎక్కువగా కొనుగోలు చేస్తారు.


ట్రాక్టర్‌తో తరలిస్తున్న పనస కాయలు

తగ్గిన దిగుబడి

గత ఏడాది కంటే ఈ ఏడాది పనస పంట దిగుబడి తగ్గింది. ప్రారంభ ధర రూ.30 పలికింది. రానురాను ధర తగ్గుతూ ప్రస్తుతం రూ.14కు చేరింది. దిగుబడి తగ్గినప్పటికీ గత ఏడాది ధర పలకడం వల్ల రైతులు బాగా నష్టపోయారు.

- అవుగాని లింగరాజు, రైతు, దుక్కవానిపేట

జగన్ అహంకారానికి చెంపపెట్టు


మాట్లాడుతున్న విద్యాసాగర్

ప్రజాశక్తి - ఆమదాలవలస

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలు జగన్మోహన్‌రెడ్డి అహంకారానికి చెంప పెట్టు అని టిడిపి లీగల్‌సెల్ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని విద్యాసాగర్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని టిడిపి కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్సీ గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో ప్రభుత్వ వ్యతిరేకత స్పష్టంగా కనపడిందని, సిఎం ఇకనైనా బుద్ధి తెచ్చుకొని ప్రజల అభిష్టానికి అనుగుణంగా నడుచుకోవాలని హితవు పలికారు. మూడు రాజధానుల పేరుతో ఉత్తరాంధ్రలో వైసిపి నాయకులు హడావుడి సృష్టించారని, ప్రజలు ఆ అంశాన్ని తిప్పికొట్టి బుద్ధి చెప్పారని అన్నారు. మూడు రాజధానుల పేరుతో ఇన్నాళ్లు కాలయాపన చేశారని, ప్రజలు ఆ విషయాన్ని గుర్తించి బుద్ధి చెప్పారని అన్నారు. ఇకనైనా మూడు రాజధానుల అంశాన్ని పక్కన పెట్టి ఏకైక రాజధాని అమరావతిని అభివృద్ధి చేయాలని సూచించారు. నిరుద్యోగుల ఆవేశం, ఉద్యోగుల ఆక్రోషం, ప్రజల వెతలు అన్నీ కలగలిసి వచ్చిన ఫలితమే ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితమని అన్నారు. ఉద్యోగుల జీతాలు నెలలో ఏదో ఒక తేదీన అందుతున్నాయి కదా అని మంత్రి బొత్స అనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైసిపికి తగిన బుద్ధి చెప్పడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు నూక రాజు, ఎంపిటిసి ఎ.భాస్కరరావు, మాజీ కౌన్సిలర్లు బోర గోవిందరావు, సంపతిరావు మురళి, టిడిపి నాయకులు తంగి గురయ్య, లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.

కాల విభజన.. ఫలితాల సాధన

ప్రజాశక్తి - శ్రీకాకుళం

ఇంటర్మీడియట్.. ఆనక పది.. ఆపై డిగ్రీ పరీక్షలు.. మరికొంచెం ముందుకు వెళ్తే పోటీ పరీక్షలు.. ఉన్న సమయం సద్వినియోగం చేసుకోకుండా.. కాలక్షేపం చేస్తే.. మంచి ఫలితాలు ఆశించలేం. ఇది పోటీ ప్రపంచం. ఏదోలా ఉత్తీర్ణత సాధిస్తే చాలు అనుకుంటే ముమ్ముందు మంచి అవకాశాలు వదులుకోవాల్సిందే. అందుకే ఇప్పటి నుంచే జాగ్రత్త పడాలి. కాల విభజనే విజయానికి కారణమన్న వాస్తవాన్ని గుర్తించాలి. ప్రణాళికాయుతంగా సాగితేనే ఒత్తిడిని అధిగమించొచ్చు. పరీక్షల్లో విజయులుగా నిలవొచ్చు.

ఈ మూడు ఎంతో కీలకం

విశ్రాంతి.. అభ్యసనం... పునశ్చరణ. ఈ మూడు ఎంతో కీలకం... విద్యార్థికి చదవడం ఎంత ప్రధానమో.. విశ్రాంతి అంతే అవసరం. మళ్లీ అభ్యసనం కొనసాగించాలి. చదివిన అంశాలను మరోసారి పునశ్చరణ చేసుకోవాలి. ఎక్కడ బలహీనంగా ఉన్నామో గుర్తించి ఆ అంశాలపై దృష్టి పెట్టాలి. ఇలా ముందుకు సాగితే అన్ని సబ్జెక్టులపై పట్టు చిక్కని అంశాలపై పట్టు చిక్కుతుంది. చదివింది నోట్సు రాసుకుంటే ఒత్తిడి చాలా వరకు దూరమవుతుంది. ఈ రోజు సమయాన్ని ఎలా వినియోగించుకున్నాం.. ఎంత వృథా చేశాం.. దాన్ని అధిగమించడం ఎలా అనే విషయాలను ఎవరికి వారు ప్రశ్నించుకుంటే విజయాలకు బాట పడుతుంది.

ప్రశాంత నిద్ర అవసరమే..

అకాడెమిక్ పరీక్షలు, ప్రభుత్వ ఉద్యోగాలకు పోటీ పరీక్షలు.. అభ్యర్థులకు ప్రశాంత నిద్ర అవసరమని మానసిక నిపుణులు చెబుతున్నారు. రాత్రి 11గంటల తర్వాత చదవడం మంచిది కాదన్నది వీరి అభిప్రాయం. మనసు నిద్ర కోరుకునే సమయంలో దానికి వ్యతిరేకంగా ముందుకు సాగితే అనారోగ్య సమస్యలకు దారితీసే అవకాశం ఉంటుంది. అందుకే రాత్రి పదిన్నర గంటల వరకు చదివి నిద్రపోవడం అన్ని విధాల మేలు. వేకువజామున 3గంటల నుంచి చదివేలా ప్రణాళిక చేసుకోవాలి. ఆ సమయంలో మెదడులో ఎలాంటి ఆలోచనలు ఉండవు. వాతావరణం ప్రశాంతంగా ఉంటుంది.

విజయులుగా నిలవాలంటే..

పరీక్షల్లో విజయులుగా నిలవాలంటే కాలవిభజన అవసరమని విద్యా మనోవిజ్ఞాన శాస్త్రం చెబుతోంది. దీని ప్రకారం.. రోజులో నిద్రకు 6-8 గంటలు కేటాయించాలి. ఇక 2-4 గంటలు కాలకృత్యాలు, వ్యాయమాం, యోగా, ధ్యానం, వ్యాపకాలకు పోగా మిగిలింది 12 గంటలు.. ఈ సమయం చాలు.. విద్యార్థులు పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించడానికి. ఉద్యోగార్థులు జీవితంలో స్థిరపడానికి. కాలాన్ని సద్వినియోగం చేసుకుంటూ పక్కాగా తయారీ చేస్తే విద్యార్థులు మంచి ఫలితాలు సాధించవచ్చు.

పిడుగుపాటుకు ఆవు మృతి


చనిపోయిన ఆవుతో రైతు

ప్రజాశక్తి - సోంపేట

మండలం లోని గొల్లవూరు గ్రామానికి చెందిన పాడి రైతు రాపాక శేషగిరికి చెందిన ఆవు గురువారం రాత్రి పిడుగు పాటుకు మృతి చెందింది. గురువారం రాత్రి వర్షం కురవడంతో రైతు ఆవును పశువుల శాలలో కట్టాడు. ఆవు పక్కన పిడుగుపడటంతో చనిపోయింది. శుక్రవారం ఉదయం ఆవుకు గడ్డి వేసేందుకు వెళ్లగా మృతి చెంది ఉంది. విషయాన్ని పశువైద్యాధిరికి తెలిపాడు. మండల పశువైద్యాధికారి ఎ.చైతన్య పరిశీలించి, పోస్టుమార్టం నిర్వహించారు. ఆవు విలువ రూ.60వేలు ఉంటుందని తెలిపారు. ప్రభుత్వ రాయితీలు ఏమైనా ఉంటే సహకారం అందిస్తామని అన్నారు.

డివైడర్ ఢీకొని వ్యక్తికి గాయాలు


గాయపడిన దిలీప్

టెక్కలిరూరల్ : మండలంలోని ఆదిత్య ఇంజినీరింగ్ కాలేజ్ సమీపంలో శుక్రవారం జాతీయ రహదారిపై వెళ్తున్న ద్విచక్ర వాహనదారుడు డివైడర్‌ను ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. పండా దిలీప్ బరంపురం నుంచి విశాఖ వెళ్తున్నాడు. వాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొంది. గాయపడిన ఆయనను 108లో టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఎస్ఐ రామకృష్ణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.


ఆర్థికసాయం అందిస్తున్న హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు

కేన్సర్ రోగికి ఆర్థికసాయం

ఇచ్ఛాపురం: ఒడిశా రాష్ట్రం పాత్రపురం మండలం సోన్నారెడ్డి గ్రామానికి చెందిన బాలకృష్ణ శెట్టి కేన్సర్‌తో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకునన సన్యాసిపుట్టుగ హెల్పింగ్ హాండ్స్ ఆర్గనైజేషన్ సంస్థ శుక్రవారం బాలకృష్ణ శెట్టికి శస్త్ర చికిత్స నిమిత్తం రూ.60వేలు ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు, గ్రామ యువత పాల్గొన్నారు.

ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి

బూర్జ: ఎన్నికల సమయంలో జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి వస్తే సిపిఎస్‌ను రద్దు చేస్తామని హామీ ఇచ్చారని, దాన్ని నిలబెట్టుకోవాలని రెవెన్యూ ఉద్యోగులు అన్నారు. ఎపి అమరావతి జెఎసి పిలుపు మేరకు శుక్రవారం తహశీల్దార్ కార్యాలయం వద్ద నల్ల రిబ్బన్లు కట్టుకొని నిరసన తెలిపారు. కార్యక్రమంలో తహశీల్దార్ రమణారావు, విఆర్‌ఒలు, కంప్యూటర్ ఆపరేటర్లు, తదితరులు పాల్గొన్నారు.


నిరసన తెలుపుతున్న రెవెన్యూ ఉద్యోగులు